
జగన్ వల్లే ఓడిపోయాం : వైసీపీ శ్రేణుల అంతర్మథనం
- 7లో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 జూన్ 2024



జగన్ సర్కార్ ప్రజలపై మోపిన చెత్త పన్ను నుంచి జిల్లా ప్రజలకు విముక్తి లభించింది. తాము అధికారంలోకి రాగానే దీనిని రద్దు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా కూటమి అధికార పగ్గాలు చేపట్టకుండానే పన్ను వసూలు చేయవద్దంటూ మునిసిపల్ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. ఈ కారణంగా జిల్లాలోని పట్టణాల్లో నివసిస్తున్న 26,73,184 కుటుంబాలకు చెత్త పన్ను భారం తగ్గింది.



చెత్త పన్నుకు స్వస్తి పలికారు

మునిసిపల్ అధికారులకు మౌఖిక ఆదేశాలు

2.67 లక్షల గృహాలకు విముక్తి.. అమల్లోకి ఎన్నికల హామీ

నరసాపురం, జూన్ 8 : చెత్తపై పన్ను వినేందుకే హాస్యాస్పదంగా ఉంది. 2021 నవంబర్‌లో జగన్ ప్రభుత్వం ఈ పన్నును అమల్లోకి తెచ్చింది. మునిసిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబం ఈ పన్ను కట్టాలని జీవో తెచ్చింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రజా సంఘాలు ఉద్యమాలు చేపట్టాయి. కానీ ప్రభుత్వం 'తగ్గేదేలే' అంటూ పన్ను వసూళ్లకే మొగ్గు చూపడంతో జిల్లాలోని మునిసిపాలిటీ పరిధిలో నివసిస్తున్న ప్రజలపై నెలవారీ భారం పడింది. నరసాపురంలో 14,656, తాడేపల్లిగూడెం 28,652, భీమవరం 38,266, పాలకొల్లు 18,959, తణుకు 23,350 కుటుంబాలపై మునిసిపాలిటీ పాలకవర్గాలు తీర్మానానికి అనుగుణంగా నెలవారీ పన్ను కడుతూ వచ్చారు. భీమవరంలో రూ.90, తాడేపల్లిగూడెం రూ.100, నరసాపురం, పాలకొల్లు రూ.60, తణుకులో ప్రాంతాన్ని బట్టి రూ.60, రూ.30గా పన్ను విధించారు. ఈ పన్ను అమలుకాక ముందు వరకు మునిసిపాల్టీలే వీధుల్లోకి వచ్చి చెత్త సేకరించేవారు. కొన్ని పురపాలక సంఘాల్లో రోజు వారీగా, మరికొన్నింటిల్లో రెండు రోజులకు ఒక్కసారి చెత్త సేకరణ జరిగేది. పన్ను వచ్చిన తర్వాత సేకరణకు ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేశారు. ఇందులో నరసాపురంలో 16, తాడేపల్లిగూడెం 33, భీమవరం 35, పాలకొల్లు 19, తణుకు 24 వాహనాలను చెత్త సేకరణకు వినియోగిస్తూ వస్తున్నారు. ఈ వాహనాలు పూర్తిగా ప్రైవేట్ ఏజెన్సీ పరిధిలో ఉంచారు.

మునిసిపాలిటీలపై భారం


పన్ను వసూలైనా, కాకపోయినా మునిసిపాల్టీ మాత్రం నెల వారీగా ఏజెన్సీ డిమాండ్‌కు అనుగుణంగా సొమ్మును జమ చేయాల్సి వచ్చేది. ఫలితంగా మునిసిపాల్టీలపై భారం పడుతూ వచ్చింది. ఏజెన్సీ మాత్రం వాహన డ్రైవర్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. చెత్త సేకరణకు వాహనంలో వచ్చే శానిటరీ సిబ్బందికి మునిసిపాల్టీనే జీతాలు ఇచ్చేది. ఈ కారణంగా ఈ పన్ను అమలు వల్ల మునిసిపాల్టీకి కలిసొచ్చిందేమీ లేదు. అదనపు భారం తప్ప. మరో వైపు పన్నును వ్యతిరేకిస్తూ చాలా మంది కట్టడం మానేశారు. దీనివల్ల బకాయిలు పేరుకుపోయాయి. వీటి వసూలుకు మునిసిపాల్టీ ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టింది. ఇన్ని లోపాలున్న ఈ విధానాన్ని తాము అధికారంలోకి వస్తే తొలగిస్తామని కూటమి హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగానే అధికారం చేపట్టకముందే అమలుకు పచ్చజెండా ఊపింది. ప్రజల నుంచి ఎట్టి పరిస్థితుల్లో చెత్త పన్ను వసూలు చేయవద్దంటూ కమిషనర్లకు మౌఖిక ఆదేశాలు అందాయి.

నామినేటెడ్ నజర్

పనిచేసిన వాళ్లకే పదవి.. ఇదే కూటమి నినాదం

- క్షేత్రస్థాయి కార్యకర్తలకు త్వరలో ఛాన్స్
- నియోజకవర్గాల వారీగా కసరత్తు
- మూడు నెలల్లోనే పెనుమార్పుకు సిద్ధం
- ఈలోపే నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారిని తప్పించేలా ఆదేశాలు

ఎన్నికల రణంలో తెగించి సొంత పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో నిద్రాహారాలు మాని, పోరాడిన కార్యకర్తలు ఎవరు ? అక్రమ కేసులకు వెరవకుండా, నిందారోపణలు లెక్క చేయకుండా జెండానే.. మా అజెండాగా భావించిన నేతలు ఎవరు.. ? త్యాగాలకు వచ్చి, ప్రాణాలకు తెగించి పార్టీని నిలబెట్టిన వారందరిని అర్హత కలిగిన నామినేటెడ్ పోస్టుల్లో నియమించాలని కూటమి నాయకత్వం భావిస్తోంది.



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

ఐదేళ్లపాటు జగన్ ప్రభుత్వంలో అక్రమ కేసులకు ఎదురొడ్డి పార్టీ కోసం నిలబడ్డ సాధారణ కార్యకర్తలకు పదవులు ఇచ్చి గౌరవించాలని భావిస్తున్నారు. ఐదేళ్లలో కులాల వారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటుచేశారు. ఛైర్మన్‌లు, పాలక సభ్యులను నియమించారు. ఎంతసేపటికి రాజకీయ ప్రయోజనాల కోసమే ఈ నియామకాలన్నీ సాగాయి. రాజకీయ నిరుద్యోగతను దృష్టిలో పెట్టుకుని కులానికో కార్పొరేషన్ ఏర్పాటుచేశారు. పాలక మండలిని ఏర్పాటుచేశారు. గౌరవ వేతనం ఇచ్చారు. కొన్నింటికి కార్యాలయాలు పెట్టి సిబ్బందిని నియమించి హంగామా చేశారు. ఇదేదో తమ సామాజికవర్గ అభివృద్ధికి పనికి వస్తుందని కొత్తలో అంతా భావించారు. ఎడాపెడా నామినేటెడ్ పోస్టులన్నీ భర్తీ చేశారు. ఉమ్మడి పశ్చిమలో వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్ పదవి దక్కిన వారు ఉన్నారు. సాహిత్య అకాడమి ఛైర్మన్‌గా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్‌గా గుబ్బల తమ్మయ్య, ఈడా ఛైర్మన్‌గా కొన్నాళ్ళపాటు ఎంఆర్డీ ఈశ్వరిని, ఏలూరు స్మార్ట్ సిటీ ఛైర్మన్‌గా మరొకరిని, వడ్డీల కార్పొరేషన్ ఇంకొకరిని, ఆక్వా అథారిటీ ఛైర్మన్‌గా రఘురామ్‌ను, ఎంబీసీ ఛైర్మన్‌గా పెండ్ర వీరన్నను నియమించారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నెడ్‌క్యాప్ డైరెక్టర్‌గా పలువురిని గత ప్రభుత్వంలో నియమించారు. వాస్తవానికి వీరి నియామకం తర్వాత జిల్లాలో ఆయా వర్గాలకు అదనపు సంక్షేమం జరిగితే ఒట్టు. కార్పొరేషన్‌లన్నింటిని నామినేటెడ్ పదవులతో నింపేశారే తప్ప వాటి మనుగడకు అవసరమైన మార్గ నిర్దేశాన్ని చేయలేకపోయారు. గౌరవ వేతనాలు ఇచ్చే వేదికలుగా అవకాశం ఇచ్చారు. వైసీపీ విజయానికి అప్పట్లో కష్టపడినందుకు జగన్ ప్రభుత్వం ఛైర్మన్‌గా నియమించి కొందరికి కృతజ్ఞత తెలిపింది. ఈ ఐదేళ్లు వీరంతా ఏమీ చేయలేక నిస్సహాయంగా మిగిలిపోయారు. ఏలూరు స్మార్ట్‌సిటీ ఛైర్మన్ పదవికి కొన్నాళ్ళపాటు ఛైర్మన్‌గా నియమించి ఆ తర్వాత ఆ ఒక్కర్ని పదవి నుంచి తొలగించారు. నియమ నిబంధనలకనుగుణంగా ఆ పదవి లేకపోవడమే కారణం. ఈడా ఛైర్మన్‌గా నియమించి కొన్నాళ్ళపాటు ఇంకొకరికి ఆ పదవి ఇచ్చేందుకు చివరిలోనూ ప్రయత్నించారు. ఇవన్నీ అప్పట్లో అధికార వైసీపీలోనే కొత్త గందరగోళానికి దారితీశాయి. వైసీపీ భావించినట్టు ఎన్నికల సమయంలో వీరందరి నుంచి పెద్ద ఎత్తున ఓట్లు పొందలేదు సరి కదా, నామమాత్రంగా వీరిప్రభావం పడలేదు. కారణం.. అధికార వైసీపీలో ఏకపక్ష విధానం, జగన్ అంతా తానే వ్యవహరించడం, అధికారుల మాట వినకపోవడం, వలంటీర్ల పెత్తనం పెరగడం.. ఇవన్నీ కలిసొచ్చి వైసీపీ పతనానికి దారితీశాయి. ఈ గందరగోళం వ్యవహారాన్ని కూటమి నాయకత్వం సమీక్షించబోతోంది. ఎక్కడికక్కడ నామినేటెడ్ పోస్టుల్లో ఇప్పటికే ఉన్న వారందరిని రాజీనామాలు చేస్తూ వైదొలగాల్సిందిగా ఆదేశాలు వెలువడ్డాయి. సాధారణంగా ప్రభుత్వం మారిన వెంటనే నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేసి తమ నైతికత ప్రదర్శిస్తారు. ఇప్పటికే కొందరు వైసీపీ అనుకూలురు నామినేటెడ్ పోస్టులకు రాజీనామాలు చేస్తే ఇంకొందరు అంటి పెట్టుకుని ఉన్నారు. వీరందర్ని పూర్తిగా తొలగించి ఆ తదుపరి కూటమి పక్షాన కష్టపడిన వారందరికి అవకాశం ఇవ్వనున్నారు.

ఈడా ఎవరి సొంతం ?

2014లో అధికార పగ్గాలు చేపట్టిన టీడీపీ అప్పట్లోనే పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా చొరవ తీసుకుంది. దీనిలో భాగంగానే ఏలూరు అర్బన్ అథారిటీ ఏర్పాటైంది. తొలి ఛైర్మన్‌గా ఉప్పాల జగదీష్‌బాబు నియమితులైన కొద్దికాలానికే తెలుగుదేశం అధికారం కోల్పోయింది. ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన వైసీపీ తొలుత ఎమ్ఆర్డీ ఈశ్వరిని ఈ పదవిలో నియమించింది. ఆ తదుపరి బొద్దాని శ్రీనివాస్‌ను నియమించారు. దీంతో వైసీపీలో కొంత వివాదం చోటు చేసుకుని ఆ పార్టీ నుంచి ఎమ్ఆర్డీ బలరామ్ బయటపడ్డారు. ఈసారి ఆయన టీడీపీ విజయానికి కష్టపడి పనిచేశారు. తిరిగి అదే పదవి తన కుటుంబానికి వచ్చేలా చూడాలని ఆయన కోరుతున్నారు. ఏలూరు కేంద్రంగా పనిచేసిన వారిని మాత్రమే ఈ అవకాశం దక్కే పరిస్థితి ఉండడంతో టీడీపీ నేతలంతా ఇప్పుడు టెన్షన్ ఫీలవుతున్నారు. కీలకమైన ఈడా ఛైర్మన్ పదవి కోసం కొద్ది రోజుల్లోనే మరికొద్దిమంది రంగంలోకి దిగే అవకాశం లేకపోలేదు.

మిత్రపక్షాలపై త్వరలో స్పష్టత

నామినేటెడ్ పోస్టుల భర్తీలో మిత్రపక్షాలకు చోటు ఇవ్వాలా? లేదా? అనే దానిపైన కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున రాబోయే మూడు నెలల్లో వీటి కసరత్తు మరింత వేగమయ్యే అవకాశం ఉన్నాయి. తొలుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాల వారీగా నామినేటెడ్ పోస్టుల సంఖ్య సమాంతరంగా ఈ పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య పరిగణనలోకి తీసుకుని అందరికి ఆమోదయోగ్యమైన జాబితాలను వెలువరించే దిశగా ఈ లోపే సుదీర్ఘ కసరత్తు జరిగే అవకాశం ఉంది. ప్రత్యేకించి బీసీ వర్గాలు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని చానాళ్ళుగా డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో వైసీపీకి స్థానం లేకుండా పోవడం, కూటమి పూర్తిగా చేజిక్కించుకోవడంతో నామినేటెడ్ పోస్టులన్నీ కూటమి పరం కాబోతున్నాయి. అధికారంలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వమే నేరుగా ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ చేసే అధికారం ఉంటుంది. ఇప్పుడు ఏకపక్షంగా కూటమి అధికారంలోకి రావడంతో వివిధ నామినేటెడ్ పోస్టుల్లో ఇంతకు ముందు అడ్డదారిన వచ్చే సిఫార్సుల మేరకే కొంతమందిని నియమించినా ఇప్పుడు ఆ తరహా తప్పులేమి జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ అరాచకానికి, అక్రమ కేసులకు, ఒత్తిళ్ళకులోనైన వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ గెలుపునకు కారణమైన కొంత మందికి ఏదో ఒక నామినేటెడ్ పోస్టు ఇప్పించేలా చూస్తానని భరోసా ఇచ్చినందున వారి విషయాన్ని తొలుత పరిగణలోకి తీసుకోబోతున్నారు.

మార్కెట్ కమిటీలకు పోటీ

నియోజవకర్గాల్లో ఎమ్మెల్యేతోపాటు పూర్తి ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చేది మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లే. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అయ్యేందుకు ఆ మేరకు నామినేటెడ్ దక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే సిఫార్సులే కీలకంగా ఉండేవి. కాని, కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సిఫార్సులకు విలువ ఇస్తూనే పార్టీలో కష్టించి పనిచేసిన సాధారణ కార్యకర్తలకూ తగిన ఛాన్స్ ఇవ్వాలని భావిస్తున్నారు. దీనికి తగ్గట్లు క్షేత్రస్థాయిలో ఎవరెవరు ఏ ఏ స్థాయిల్లో కష్టపడింది ? జాబితాలు తయారవుతున్నాయి. కీలక మార్కెట్ యార్డుల్లో ఛైర్మన్‌లుగా వున్న వారిలో కొంత మంది రాజీనామాలకు సిద్ధపడి ఆ పోస్టులను ఖాళీ చేస్తున్నారు. రాబోయే మూడు నెలల కాలంలోనే ఈ పదవులన్నింటిని భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి.

ఆరోగ్యశ్రీ బంద్ !

ప్రభుత్వం నుంచి భారీగా బకాయిలు..

శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆసుపత్రుల నిరాకరణ

సొమ్ములు చెల్లించాల్సి వస్తోందని బాధితుల ఆవేదన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు భారీగా పేరుకుపోవడంతో చాలా వరకు ఆసుపత్రుల్లో సేవలను నిలిపివేశారు. ఉద్యోగ ఆరోగ్య పథకం(ఈహెచ్‌ఎస్)లోనూ చికిత్స చేయడం లేదు. శస్త్ర చికిత్సలకు ఉద్యోగులు సొమ్ములు చెల్లించాల్సి వస్తోంది. ఆ తర్వాత ప్రభుత్వానికి బిల్లులు పెడుతున్నారు. అవి కూడా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,500 కోట్ల మేర ప్రభుత్వం నుంచి ఆసుపత్రులకు బకాయిలు విడుదల కావాల్సి వుంది. విడుదల చేయకపోతే సేవలు నిలిపివేస్తామంటూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. ఇప్పుడు పూర్తిగా నిలిపివేశాయి. అత్యవసర సేవల కోసం ఆసుపత్రులకు వెళితే బిల్లులు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డులను తీసుకోమంటూ స్పష్టం చేస్తున్నారు. వాస్తవానికి జగన్ అధికారంలో ఉన్నప్పుడు రూ.1,000 అయినా ఆరోగ్యశ్రీలో బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. చెప్పిన మాటలకు, చేసిన పనులకు పొంతన లేకపోయింది. ప్రమాదాలకు గురైె క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలిస్తే సొమ్ములు కట్టిన తర్వాతే చికిత్స ప్రారంభిస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో 72 ఆసుపత్రుల్లో వైద్య సేవలందుతున్నాయి. ఆర్థో, డెండిస్ట్, గైనకాలజీ వంటి సేవలను ఇప్పుడు వినియోగించుకోలేకపోతున్నారు. కంటి ఆసుపత్రుల్లో కార్డులు పనిచేయడం లేదు. ఒకవేళ సేవలందించాలంటే నాసిరకం ఉపకరణాలు ఉపయోగిస్తామంటూ వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అదనంగా సొమ్ములు చెల్లిస్తేనే నాణ్యమైన వైద్యం అందిస్తామని తేల్చి చెపుతున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ వైద్యం అందిస్తామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పింది. రాష్ట్రంలో ఆసుపత్రులే ఆరోగ్యశ్రీలో వైద్యం అందించే పరిస్థితి లేదు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులు చేతులెత్తేస్తున్నాయి. గతంలో ప్రభుత్వం రూ.300 కోట్లు విడుదల చేసింది. వైద్య సేవలందించాలని కోరింది. ఆ తర్వాత మళ్లీ మొండిచేయి చూపింది. ఆ ప్రభావం ఇప్పుడు రోగులపై పడుతోంది. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలందుకోలేకపోతున్నారు.

- కొల్లేరులో దెబ్బతింటున్న భూగర్భ జలాలు
- సరస్సులో 12 శాతానికి ఉప్పు నీటి సాంద్రత



ఉప్పు నీటి సరస్సు

కైకలూరు, జూన్ 8: ప్రపంచంలోనే అతిపెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు ఉప్పు నీటి కాసారంగా మారింది. ఏటా వర్షాకాలం పుష్కలంగా నీరున్నప్పటికీ నీటి నిల్వలకు ఎలాంటి ప్రణాళిక లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. రోజూ సముద్రపు నీరు పోటు ద్వారా ఉప్పుటేరు నుంచి కొల్లేరులోకి చేరడంతో సహజ సిద్ధంగా పెరిగే మత్స్యసంపద, జీవ రాశులు మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో వేలాది మంది మత్స్యకారులు సైతం తమ ఉపాధిని కోల్పోతున్నారు.

ఉప్పు సాంద్రత

ఏటా వర్షాకాలంలో పది వేల క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి కొల్లేరులోకి చేరుతుంది. ఈ నీటిని నిల్వ ఉంచేందుకు రెగ్యులేటర్ లేకపోవడంతో పోటుకు సముద్రపు నీరు కొల్లేరులోకి చొచ్చుకొస్తోంది. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండడంతో ఉప్పుటేరులో నీటి ఉప్పు 12 శాతం చేరుకుంది. ఇంత పెద్ద శాతం ఉప్పు ఉండడంతో ఎలాంటి మత్స్యసంపదైనా గుర్రపు డెక్క, తూడు చనిపోతుంది. అనధికారికంగా కొల్లేరులో సాగు చేస్తున్న రొయ్యల చెరువులు, అనేక గ్రామాల్లో రొయ్యల సాగు ఉప్పు నీటిలోనే చేస్తుండడంతో కొల్లేరులోనే కాక ఈ ప్రాంత నేలలు ఉప్పు నీటి కయ్యలుగా మారాయి. గతంలో ఊట బావులు తీసినా, బోర్లు వేసినా 20 నుంచి 30 అడుగులు లోతులో తీపి నీరు వచ్చేది. ప్రస్తుతం భూగర్భ జలాలు ఉప్పుమయంగా మారడంతో 100 అడుగుల లోతు భూమి లోపలకి వెళ్లినా ఉప్పు నీరే వస్తోంది. ఆక్వాలో రొయ్యల సాగుకు ఉప్పు నీరు అనుకూలంగా ఉన్నప్పటికీ చేపల పరిశ్రమకు తీరని దెబ్బ. ఉప్పు టేరు పరీవాహక ప్రాంతమైన కైకలూరు, కలిదిండి, కృష్ణా జిల్లా బంటుమిల్లి, కృత్తివెన్ను, పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ, ఆకివీడు తదితర మండలాల్లో రెండు లక్షల ఎకరాలకుపైగా చేపల సాగు జరుగుతోంది. ఎగువ నుంచి నీరు కాల్వల ద్వారా అందకపోతే ఉప్పుటేరు పరీవాహక ప్రాంతంలోని రైతులంతా ఈ ఏరులోని నీటినే చేపలకు నింపుకుంటుంటారు. ఏటా భారీగా వర్షాలు కురిస్తే ఉప్పుటేరులోకి జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ఉప్పు నీరు చేరుతుంది. ఇలా చేరే నీటిలో మే నెల దాటే సరికి ఉప్పు సాంద్రత పది శాతం నమోదవుతోంది. దీంతో చేపల పరిశ్రమకు ఏ విధంగానూ ఈ నీరు ఉపయోగపడడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పక్షులు, పశువులకు తాగు నీరు కరువు

కొల్లేరు ఉప్పు నీటి సరస్సుగా మారడంతో పక్షులకు, పశువులకు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాయి. రైతులు తమ పశువులను కాపాడేందుకు దూర ప్రాంతాల నుంచి మంచినీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. దేశ విదేశాల నుంచి వచ్చే వలస పక్షులు సైతం ఈ ఉప్పునీరు వల్ల సరైన ఆహారం దొరక్క విలవిలలాడుతున్నాయి. సరస్సులోకి ఉప్పు నీరు రావడం వల్ల అనేక రకాల చేపలు కనుమరుగయ్యాయి. తెల్ల, నల్లజాతి చేపలు సైతం ఉప్పు నీటి దెబ్బకు అంతరించిపోతున్నాయి. ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మాణం చేస్తే వేసవిలో ఉప్పు నీరు వచ్చే సమయంలో సరస్సులోకి చేరకుండా అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

టిడ్కో ఇళ్లకు మోక్షం



కూటమి విజయంతో లబ్ధిదారుల్లో ఆశలు

రాష్ట్రంలో తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి విజయం సాధించడంతో టిడ్కో ఇళ్లకు మోక్షం లభించనుంది. లబ్ధిదారుల్లో ఆశలు చిగురించ గా, దీనికి అనుగుణంగా ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా విజయం సాధించిన ప్రజా ప్రతినిధులు ఈ ఇళ్ల నిర్మాణంపై సమీక్షలు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో పూర్తిచేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు మూడేళ్లు నాన్చి, ఆనక పార్టీ రంగులు వేసి, మౌలిక సదుపాయాలు కల్పించకుండానే అందించారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- శ్రావణమాసంలో పాలకొల్లులో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ
- తాడేపల్లిగూడెం, భీమవరంలలో సమీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8:కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ ఇళ్ల పరిస్థితిపై ఆరా తీసి లబ్ధిదారులకు త్వరితగతిన అందించాలని ఆదేశాలిచారు. సీఎంగా చంద్రబాబు పాలకొల్లులో లబ్ధిదారులకు శ్రావణమాసంలో ఇళ్లను అందిస్తామని తెలిపారు. భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబు ఈ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరక ముందే టిడ్కో ఇళ్లపై సమీక్షలు నిర్వహించి త్వరలోనే అప్పగించేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయని లబ్ధిదారులు ఆనందిస్తున్నారు.

రంగులకే కోట్లు

వైసీపీ ప్రభుత్వంలో కక్ష సాధింపులో భాగంగా చంద్రబాబు హయాంలో నిర్మించిన ఇళ్లను ఇచ్చేందుకు మొగ్గు చూపలేదు. సరికదా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేలా పూర్తయిన ఇళ్లను సైతం గాలికి వదిలేశారు. దీంతో ఆ టిడ్కో ఇళ్లు పాములకు నిలయాలుగా మారాయి. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో వీటిని క్వారంటైన్‌లుగా మార్చి రోగులను ఇక్కడ ఉంచారు. వైసీపీ ప్రభుత్వం తన రంగుల పిచ్చితో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు.

లబ్ధిదారులకు ఇవ్వలేదు

భీమవరంలో సింగిల్ బెడ్ రూం, డబుల్ బెడ్ రూంలు కలిపి 8,352 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, పాలకొల్లులో 6,144, తాడేపల్లిగూడెంలో 5,376 ఇల్లు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం కొలువు తీరే నాటికి సగానికిపైగా ఇళ్లకు పైపు లైన్‌లు, విద్యుత్ అందించగా వాటిని లబ్ధిదారులకు అందించడంలో తాత్సారం చేశారు. దీంతో కొండంత ఆశలతో ఉన్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. కట్టిన ఇళ్లు కళ్ల ముందే ఉన్నా, వాటిని తమ సొంతం చేసుకోలేక, అద్దె ఇళ్లల్లో మగ్గ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లో మొత్తం 19,872 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయగా మూడున్నరేళ్ల తర్వాత వైసీపీ ప్రభుత్వం తొలి విడతగా ఆరు వేల ఇళ్లు, రెండో విడతగా జనవరిలో మూడు వేల ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించారు. తొలి విడతలో పట్టాలు పొందిన వారు అరకొర సదుపాయాలతో కాపురాలకు వచ్చి పాములు, తుప్పల మధ్య నివాసం ఉన్నారు. మంచినీరు, విద్యుత్ సరఫరా తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారు. మూడున్నరేళ్లు పూర్తయిన ఇళ్లను గాలికి వదిలేయడం వల్ల పైన శ్లాబులపై నీళ్లు నిలిచి పెచ్చులు ఊడి లీకయ్యే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు వస్తున్నాయన్న సమయంలో హడావుడిగా లీకైన శ్లాబులను మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు.

ఈఎంఐల ఒత్తిడి

ఎన్నికల సమయంలో టిడ్కో లబ్ధిదారులు ఎవరికి పైసా కట్టాల్సిన పనిలేదంటూ హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక ఆ ఊసే ఎత్తలేదు. అప్పటికే అగ్రిమెంట్‌లు పూర్తి చేసుకున్న ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఈఎంఐల ఒత్తిడి ఎక్కువైంది. తాము ఇటు ఇల్లు సొంతం చేసుకోలేదన్న బాధ ఓ వైపు, అద్దెలు చెల్లించలేక మరోవైపు నలిగిపోతున్న లబ్ధిదారులకు గోరుచుట్టుపై రోకటిపోటులా ఈఎంఐలు చెల్లించాలనే ఒత్తిడి పెరగడంతో లబ్ధిదారులు అధికారుల వద్దకు పరుగులు తీశారు. వారు ఏం చెప్పాలో తెలియక చేతులెత్తేయడంతో ఏం చేయాలో తెలియక గందరగోళంలో ఉండేవారు.

బొలిశెట్టిని కలసిన డీఎస్పీ మూర్తి



బొలిశెట్టికి అభినందనలు తెలుపుతున్న డీఎస్పీ మూర్తి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 8: తాడేపల్లిగూడెం డివిజన్ డీఎస్పీ మూర్తి తన సిబ్బందితో కలసి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా ఎన్నికైన బొలిశెట్టి శ్రీనివాస్‌ను శనివారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలంటూ డీఎస్పీని కోరారు. పట్టణ, రూరల్ సీఐలు ఎ. సుబ్రహ్మణ్యం, ఎ. రమేష్, ఎస్ఐలు జేబీఎస్ ప్రసాద్, వి.సురేష్, శీలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలపై తొలగించిన జగన్ ఫొటోలు



రేషన్ వాహనంపై తొలగించిన జగన్ ఫొటో

ఆకివీడు, జూన్ 8: వాహనాలపై జగన్ ఫొటోలు లేకుండా రేషన్ బియ్యం అందించాలని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇంటింటికి అందించే రేషన్ బియ్యం వాహనాలకు ఉన్న జగన్ ఫొటో కనబడకుండా బియ్యం, సరుకులు అందించాలని టీడీపీ శ్రేణు లు డిమాండ్ చేయడంతో శనివారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందిస్తూ డిప్యూటీ తహసీల్దార్ ఫరూఖ్ ఎండీయూలకు ఆదేశాలు జారీ చేశారు. రేషన్ సరఫరా చేసే వాహనాలుకున్న మాజీ సీఎం జగన్ ఫొటోలు కనబడకుండా మండలంలో ఉన్న అన్ని వాహనాలకు రంగులు వేసిన తరువాత సరఫరా చేయాలన్నారు.

నేడు ఆదర్శ లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ఆకివీడు, జూన్ 8: ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం స్థానిక వీ-కన్వెన్షన్ హాల్‌లో ప్రమాణస్వీకారం చేస్తారని నిర్వాహకులు శనివారం లయన్స్ కార్యాలయంలో తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ ప్రముఖులు తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

భీమవరం క్రైం, జూన్ 8 : హెచ్ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు ఏఆర్టీ మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ముఖ్యమని భీమవరం ప్రభుత్వాసుపత్రి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.గోవిందబాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.రాంబాబు అన్నారు. శనివారం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పశ్చిమ గోదావరి జిల్లా పాజిటివ్ సొసైటీ భీమవరం, మానవతా సంఘం ఆధ్వర్యంలో 35 మంది చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా పాజిటివ్ పీపుల్ ప్రెసిడెంట్ కముజు శ్రీను మాట్లాడుతూ దాతలు చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను పాజిటివ్ పీపుల్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. సెక్రటరీ భాస్కర్, వైఐఆర్‌జీకేర్ ఓఆర్‌డబ్ల్యూ పి.శేషారాజ్యం, ఏఆర్టీ సిబ్బంది, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ బీవీ రాజుకు ఘన నివాళులు



సెయింట్ మేరీస్ హాస్పిటల్‌లో మందులు అందజేత

భీమవరం ఎడ్యుకేషన్/టౌన్, జూన్ 8 : యువత, విద్యార్థులు డాక్టర్ బీవీ రాజును ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ భీమవరం వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బీవీ రాజు 22వ వర్థంతి పురస్కరించుకని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత బీవీ రాజు సమాధి వద్ద కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని ఫాదర్ ఎఫ్ఎంఎల్ ఆర్ సెంటర్, సెయింట్ మేరీస్ లెప్రసీ సెంటర్‌లలోని లెప్రసీ, హెచ్ఐవీ, టీబీ రోగులకు మందులు, బియ్యం, మామిడి కాయలు, బిస్కెట్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. పట్టణంలోని 7వ వార్డులోని లెప్రసీ కాలనీలోని 112 మంది రోగులకు పెన్షన్‌లు అందజేశారు.

పేద ప్రజలకు అండగా ఉంటాం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ఉండి, జూన్ 8 : లయన్స్ క్లబ్ ద్వారా పేద ప్రజలకు ఉత్తమ సేవా కార్యక్రమాలు అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ అన్నారు. శనివారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌ను దృష్టిలో పెట్టుకుని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ దాతలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంభశివరాజు సూర్యకుమారి దంపతులు ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, పురుషులకు ప్యాంటు, షర్టులు ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు హరినాథరాజు, బొండాడ కేశవరావు, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన రేషన్ డీలర్లు

ఉండి, జూన్ 8 : రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహించిన సమావేశానికి ఉండి నియోజకవర్గం నుంచి డీలర్లు తరలి వెళ్లారు. శనివారం విజయవాడలో జరిగిన రేషన్ డీలర్ల సమావేశంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా అందించామని డీలర్లు తెలిపారు. ఉండి నియోజకవర్గం నుంచి ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల డీలర్లు వెళ్లారు.

ఆలయాల పాలక మండళ్ల రాజీనామాలు



క్షీరా రామలింగేశ్వర స్వామి ఈవోకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చైర్మన్, ట్రస్టీలు

పాలకొల్లు అర్బన్, జూన్ 8: రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు దేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వం నియామకం చేసిన దేవదాయ శాఖ ఆలయాల పాలక మండళ్ల శనివారం రాజీనామా చేశాయి. క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం పాలక మండలి చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్టీలు శనివారం రాజీనామాను ఈవో యాళ్ళ సూర్యనారాయణకు అందించారు. అష్టభుజ లక్ష్మీనారాయణ దేవస్థానం చైర్మన్ జవ్వాది వెంకటపానకాలు, ట్రస్టీలు ఈవో బీవీ శంకర్‌కు, డైలీ మార్కెట్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ జోగి వెంకటేశ్వరరావు, ట్రస్టీలు, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావుకు కనకదుర్గ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, ట్రస్టీలు, ఈవో ఎన్ సతీష్ కుమార్‌కు, మన్యం జగ్గమ్మ సత్రం చైర్మన్ నంబూరి గంగా పవన్, ట్రస్టీలు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావుకు రాజీనామాలను అందించారు.

నేడు హిందూ ధర్మ పరిరక్షణ సమితి వార్షికోత్సవం

పెనుగొండ, జూన్ 8 : పెనుగొండ మండలం సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి ప్రథమ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తామని సమితి సభ్యులు తెలిపారు. హిందూ ధర్మ బంధువుల ఆత్మీయ సమ్మేళనం పేరుతో ఏర్పరిచే కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మదర్స్‌డే వేడుకలు, సమితి కార్యక్రమాల విశేషాలు, అనంతరం విందు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు.






రామోజీరావు చిత్రపటాల వద్ద భీమవరంలో మంతెన రామరాజు.. పెనుగొండలో టీడీపీ నాయకులు, తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ నివాళులు.. హైదరాబాద్‌లో రామోజీరావు పార్థివదేహానికి ఉండి ఎమ్మెల్యే రఘురామ నివాళి

రామోజీరావుకు ఘన నివాళి

▸▸ పలు సంఘాలు, పార్టీ కార్యాలయాల్లో చిత్రపటాల వద్ద ప్రముఖుల నివాళులు

అక్షరయోధుడు, ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి జిల్లావ్యాప్తంగా శనివారం నివాళులర్పించారు. పత్రికా, సినీ తదితర రంగాలకు ఆయన లేనిలోటు తీరనిదని ఆయన సేవలను పలువురు కొనియాడారు. జిల్లాలో రామోజీరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం టౌన్/భీమవరం అర్బన్, జూన్ 8: అక్షరయోధుడు, ఈనాడు గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పాత్రికేయ రంగానికి తీరనిలోటు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. భీమవరంలోని టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రామోజీరావు లేరన్న వార్త తెలుగుజాతిని శోకసముద్రంలో ముంచివేసిందన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీను, నాయకులు పాల్గొన్నారు. అక్షర యోధుడు రామోజీరావు అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. రామోజీరావు మరణం పట్ల టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, మల్లినీడి తిరుమలరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉండపల్లి రమేష్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి.బలరాం, కోనాల భీమారావు సంతాపాన్ని తెలిపారు. చెరుకువాడ రంగసాయి, క్లబ్ సభ్యులు బోండా రాంబాబు, అల్‌ఇండియా ఫార్వర్డ్ పార్టీ జిల్లా నాయకులు లంకా కృష్ణమూర్తి, దండు శ్రీనివాసరాజు సంతాపాన్ని తెలిపారు. తెలుగు పత్రికా రంగానికి, తెలుగు భాష అభివృద్ధికి రామోజీరావు చేసిన కృషి వల్లే లక్షల మంది ఉపాధి పొందుతున్నారని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వాకాల సత్యసాయిబాబా, ఏరియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేవీ ప్రసాద్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

● తాడేపల్లిగూడెం అర్బన్/పెంటపాడు, జూన్ 8: టీడీపీ పట్టణ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జనసేన పార్టీ కార్యాలయంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆయా కార్యాలయాల్లో రామోజీరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ముప్పిడి రమేష్, పసల కొండ, సుభద్ర, పి. చంద్రశేఖర్, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, కొల్లూరి బాబు, బుద్దన ధనరాజు ఉన్నారు. పెంటపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. దాసరి అప్పన్న, నల్లమిల్లి చినగోపిరెడ్డి, నక్కా సాంబశివరావు, బండారు వెంకట్రావు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, నాళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆకివీడు/పాలకోడేరు/ఉండి, జూన్ 8: అస్తమించిన అక్షర యోధుడు రామోజీరావు అని టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొంట్లా గణపతి, నౌకట్ల రామారావు, గంధం ఉమా, అజ్మల్, అడపా అబ్బులు, జాకీర్, శ్రీనివాస్, బచ్చు కృష్ణ, పెద్దిరాజు, సిద్ధాపురంలో భూపతిరాజు తిమ్మరాజు తదితరులు నివాళులర్పించారు. ఉన్నారు. పాలకోడేరు మండలంలోని పాలకోడేరులోని టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లా ఎస్టీ నాయకుడు సాలా మల్లేశ్వరరావు, దొంగ కృష్ణ, పెంటకూటి మాధవరావు, వెంకటేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. మహోన్నతమైన వ్యక్తి రామోజీరావు అని ఆయన సేవలను ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కొనియాడారు. శనివారం ఆయన మరణవార్త విని హైదరాబాద్ వెళ్లి రామోజీ మృతదేహం వద్ద నివాళులర్పించారు.

● పాలకొల్లు అర్బన్/యలమంచిలి, జూన్ 8 : రామోజీరావు విలువలతో కూడిన పత్రిక నడిపారని, ఆయన మరణం దిగ్భ్రాంతి కలిగించిందని కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపి చేగొండి వెంకట హరిరామ జోగయ్య అన్నారు. పత్రికా, సినీ రంగాల్లోనూ ఆదర్శాలతో పనిచేసి ఎందరికో మార్గదర్శనం చేసిన వ్యక్తి రామోజీరావు అని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి తెలిపారు. యలమంచిలిలోని ఎన్టీఆర్ పార్క్ వద్ద శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి శ్రీనివాస్(బుజ్జి), టీడీపీ నాయకులు, కార్యకర్తలు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళ్లూరి సత్య శ్రీను, కడలి విజయ్, చిలుకూరి శ్రీనివాస్, గొడబ కుమార్, బర్రే ప్రసాద్, బొప్పన రాంబాబు, శిద్దాని రాము, తాళ్లూరి చందు, బొబ్బా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్ : ఈనాడు అధినేత రామోజీరావు మృతికి శనివారం టీడీపీ కార్యాలయంలో చిత్రపటానికి ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తదితరులు నివాళులర్పించారు. ప్రెస్‌క్లబ్‌లో గౌరవ అధ్యక్షుడు త్రినాథ్, సీనియర్ జర్నలిస్టులు వెంకటేశ్వరావు, కె.శ్రీనివాస్ రామోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జర్నలిస్టులు భగవాన్, అనందరాజు, ప్రభాకర్, విజయకుమార్, దివి వెంకటేశ్వరావు, రాము, కొండా తదితరులు పాల్గొన్నారు.

● తణుకు/అత్తిలి, జూన్ 8: తణుకు ఆంధ్రా షుగర్స్‌లో రామోజీరావు చిత్రపటానికి ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఆర్ ఎం.సాంబశివరావు, ఎల్.డబ్ల్యు.ఒ. శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. 14వ వార్డులో మాజీ కౌన్సిలర్ చిట్టూరి సాయిబాబా ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అత్తిలి టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● పెనుమంట్ర/పెనుగొండ/ఆచంట/పోడూరు, జూన్ 8 : మహాయోధుడు రామోజీరావు మరణవార్త తనని దుఃఖ సాగరంలో నింపిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపం వ్యక్తం చేశారు. పెనుగొండ టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి సర్పంచ్ నక్కా శ్యామల సోని శాస్త్రి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కటికిరెడ్డి నానాజీ, వేంద్ర రాము, మండా ప్రసాద్, రొక్కాల సురేష్, పులిగోరు రవి కుమార్, తుమ్మలపల్లి రవి , మద్దింశెట్టి వెంకటేష్ తదితరులున్నారు. వడలి గ్రామంలో టీడీపీ నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆచంట మండలం ఆచంట, కొడమంచిలి గ్రామాల్లో టీడీపీ, జనసేన నేతలు రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గొడవర్తి శ్రీరాములు, జవ్వాది బాలాజీ , తమ్మినీడి ప్రసాద్,కేతా మీరయ్య చిలుకూరి సీతారామ్, బీరా నరసింహమూర్తి, గణేషుల సత్తిబాబు, కేతా మురళి తదితరులు పాల్గొన్నారు. పోడూరు మండలం జిన్నూరు పంచాయతీ కార్యాలయం వద్ద రామోజీరావు చిత్రపటానికి టీడీపీ నాయకులతో కలసి డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ నివాళులర్పించారు. పాలవలస తులసీరావు, దాసరి రత్నరాజు, మేకా నాగబాబు, యలకల శ్రీను పాల్గొన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు నివాళులర్పించారు. టీడీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, గండేటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం, జూన్ 8: గణపవరం, పిప్పర, మొయ్యేరు, మల్లపురాజుపేట గ్రామాల్లో రామోజీరావు చిత్రపటాలకు టీడీపీ, జనసేన నేతలు పూలమాలలు వేసి సంతాప సమావేశాలు నిర్వహించారు. ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, యాళ్ళ సుబ్బారావు, కానుమిల్లి చంటి,ఇంటూరి చంద్రమోహన్‌రావు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, తోట శ్రీనివాసరావు, గంటా అన్నవరం తదితరులు నివాళు లర్పించారు.





ఆకివీడులో టీడీపీ నాయకులు.. పయ్యేరులో టీడీపీ, జనసేన నాయకులు.. తణుకులో ఆంధ్రాషుగర్స్ జేఎండీ అచ్యుతరామయ్య నివాళులు

మామిడిపండ్ల అలంకరణలో వెంకన్న



నరసాపురం రూరల్, జూన్ 8: వేములదీవి గ్రామంలోని గ్రామంలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేశారు. మామిడిపండ్లతో స్వామికి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 8: చంద్రబాబు నాయుడు సీఎంగా, ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ విజయం సాధించడం పట్ల జగన్నాథపురం రామాలయంలో శనివారం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. గ్రామానికి చెందిన బొల్లిన హైమవతి, వల్లభనేని సత్యవతి నాయకత్వం వహించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించాలని వారు పూజలు చేశారు.

విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

ఏలూరు టూ టౌన్, జూన్ 8: నగరంలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని సీపీఎం నగర కార్యదర్శి కిషోర్ డిమాండ్ చేశా రు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుకుంటూ పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీఓ ప్రకారం ఐదో తరగతి లోపు చదివే విద్యార్థులకు రూ.10 వేలు, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.15 వేలు, కళాశాలలో చదివే విద్యార్థులకు రూ.17,500లలోపు ఫీజులు వసూలు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా రెండు,మూడు రెట్లు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విద్యాహక్కు చట్ట ప్రకారం కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఎక్కడా కేటాయించటం లేదన్నారు. కనీసం కళాశాల, పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు ఉండవని, స్వచ్ఛమైన మంచినీరు కూడా అందించటం లేదన్నారు. రామాంజనేయులు, సాయిబాబు, ప్రసాద్, జగన్నాథరావు, కిషోర్, అరుణకుమారి, హైమ, తదితరులు పాల్గొన్నారు

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నేతలు

ఏలూరు రూరల్, జూన్ 8: స్థానిక ఆదివారపు పేటలో ఉన్న శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం పర్యవేక్షకులు ఇసుకపల్లి తాతారావు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటిని సత్కరించారు. బాబా చిత్రపటాన్ని అందజేసి అభినందించారు. చంటి మాట్లాడుతూ ఆలయానికి సంబంధించి ఎటు వంటి సహకారం కావాలన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బాబాభక్తులు పాల్గొన్నారు.

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శనివారం ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద రాష్ట్రీయ లోక్ జన శక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చాగంటిపాటి జాన్‌వెస్లీ మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమికి ఆర్ఎల్ జేపీ ఎన్నికల్లో మద్దతు ఇచ్చింది. లోకేశ్ మంగళగిరి నుంచి భారీ మెజారిటీతో గెలుపొందడంతో ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించినట్లు జాన్‌వెస్లీ తెలిపారు. వారిని కలిసిన వారిలో శామ్యూల్, ప్రణీత్, రాము, ప్రభాకర్ ఉన్నారు.



పితానికి అభినందనలు తెలుపుతున్న ఆర్వో స్వామి నాయుడు

పితానిని కలసిన డిప్యూటీ కలెక్టర్

ఆచంట, జూన్ 8 : ఆచంట ఎమ్మెల్యేగా విజయం సాధించిన పితాని సత్యనారాయణను రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ వి.స్వామినాయుడు, ఆచంట తహసీల్దార్ ఐవీశెట్టి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

మహనీయుల విగ్రహాల తొలగింపు అన్యాయం

భీమవరం అర్బన్, జూన్ 8: బీజేపీ నిరంకుశ, స్వార్థ రాజకీయాలకు నిదర్శనం పార్లమెంటు ఆవరణలో ఉన్న గాంధీ, అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాల తొలగింపు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. శనివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్లమెంటు ఆవరణలో మహనీయుల విగ్రహాల తొలగింపును నిరసిస్తూ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెన్నీ గోపాలన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లబోయిన రంగారావు మా ట్లాడుతూ మహనీయుల విగ్రహాల తొలగింపు బీజేపీ మతోన్మాద పాలనకు అద్దం పడుతుందని, యథావిధిగా విగ్రహాలను ఉంచాలన్నారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఖాన్ బాషా, రైతు సంఘం నాయకులు తిరుమాని కామేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత 'పొన్నమండ' మృతి

నరసాపురం టౌన్, జూన్ 8: పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పొన్నమండ నాగేశ్వరరావు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీకి అనేక సేవలందించారు. ఆయన మృతికి మాజీ మంత్రి కొత్తపల్లి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, కొప్పాడ రవి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఏలూరు క్రైం, జూన్ 8 : తలసేమియా చిన్నారులకు రక్త నిల్వలులేక ఇబ్బంది గురవుతున్నారని తెలుసుకున్న ఓ యువకుడు తన స్నేహితులను తీసుకువచ్చి రక్తదానం చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ప్రతి నెలా తలసేమియా చిన్నారులకు రక్తాన్ని ఎక్కిస్తూ ఉంటారు. వేసవి దృష్ట్యా రక్త నిల్వలకు ఇబ్బందులు కలగడంతో ఈ విషయం తెలుసుకున్న కె.జాషువా అనే యువకుడు తన స్నేహితులను ప్రోత్సహించి రెడ్‌క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డికి తెలియజేశారు. దీంతో 27 మంది యువకులు వచ్చి రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేసి తలసేమియా చిన్నారులకు రక్త కొరతను తీర్చారు. రక్తదానం చేసిన జాషువా అతని స్నేహితులను రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌పి వర ప్రసాదరావు, డాక్టర్ స్పందన, పీఆర్వో కేవీ రమణ అభినందించారు.



ఎమ్మెల్యే నిమ్మలను అభినందిస్తున్న బ్రాహ్మణ, పురోహిత సంఘ నాయకులు



రామారావుపేటలో కేక్ కట్ చేస్తున్న గణేష్ అభిమానులు

ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మలకు అభినందనలు

పాలకొల్లు అర్బన్, జూన్ 8: మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడును బ్రాహ్మణ సంఘం, పురోహిత సంఘం నాయకులు, బ్రాహ్మణ సాధికార సమితి నియోజకవర్గ కన్వీనర్ పెండ్యాల భవానీ ఆధ్వర్యంలో కలిసి అభినందించి, ఆశీస్సులు అందించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనకు వడిఘట్టం కట్టి, శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలను అందించి, క్షీరా రామలింగేశ్వరస్వామి ప్రసాదాన్ని అందజేసారు. మద్దూరి సూరిబాబు, కోట అనిల్‌కుమార్, పూర్ణయ్య, ముసునూరి ఫణీ, తనికెళ్ల శ్రీనివాస్, మునుకుట్ల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

● అనంతరం పట్టణంలోని 22వ వార్డు రామారావు పేటలో మాజీ కౌన్సిలర్ వట్టం గణేశ్ అధ్యక్షతన విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు (జీవీ) విచ్చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సాధికార, సేవా మిత్రలకు, గణేష్ వ్యాపార సంస్థ వీరభద్ర షాపింగ్ మాల్లో పనిచేసే సిబ్బంది నూతన వస్త్రాలను అందజేశారు. పార్టీ పట్టణ నాయకులు పెచ్చెట్టి బాబు, ఎం.ఫకీర్ బాబు, జగ్గురోతు రాంబాబు, బి.శేఖర్, షణ్ముక్, కౌశిక్, అల్లం తాతారావు, 22వ వార్డు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయకర్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నాయకర్‌కు టీడీపీ నాయకుల అభినందనలు

నరసాపురం, జూన్ 8: నరసాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన బొమ్మిడి నాయకర్‌ను శనివారం టీడీపీ నాయకులు అభినందించారు. పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అధ్వర్యంలో జనసేన కార్యాలయంలో నాయకర్‌కు బొకేలు అందిం చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, గుబ్బల నాగరాజు, పాలూరి బాబ్జి పాల్గొన్నారు.

బాబ్జికి ఆర్యవైశ్య సంఘ నాయకుల అభినందన



వలవల బాబ్జిని సత్కరించిన ఆర్యవైశ్య సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్/ రూరల్, జూన్ 8: కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య సంఘ నాయకులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. పద్మనాభుని మురళి తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం మండలం అమృతపురానికి చెందిన దాసరి వెంకటేశ్వరరావు, లింగారాయుడుగూడెంకు చెందిన మైనం సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాలను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సర్పంచ్ పోతుల అన్నవరం, నాయకులు వాడపల్లి వెంట సుబ్బరాజు, కాసగాని రాంబాబు తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నరహరి ఎన్నిక


నరహరి, అధ్యక్షుడు   రమణయ్య, ప్రధాన కార్యదర్శి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 8 : డెమొ క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీ ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కె.నరహరి ఎన్నికయ్యారు. విజయ వాడలోని ఏపీ ఎన్జీవో హోంలో శని వారం జరిగిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఎన్నికలు జరిగాయి. సంఘ రాష్ట్ర ప్రదాన కార్య దర్శిగా రమణయ్యను ఎన్నుకున్నారు. నరహరి మాట్లాడుతూ జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసి హైస్కూళ్ళకు గతేడాది తరలించిన ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు తిరిగి తరలించాలని డిమాండ్ చేశారు.మాతృభాషలోనే ప్రాథమిక విద్యను బోధించేలా నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.


కవయిత్రి మాధవీలతను సత్కరిస్తున్న దృశ్యం

కళలను, కవులను ప్రోత్సహించాలి

భీమవరం టౌన్, జూన్ 8 : సామాజిక అంశాలపై 1500లకు పైగా కవితలు రచించిన కొమ్ముల మాధవీలతకు తెలుగు భాషాభిమానుల సంఘం ఆధ్వ ర్యంలో పీఎస్ఎన్ బాలికల పాఠశాలలో శనివారం అభినందన సత్కారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రచయిత, తెలుగు భాష సంఘ సభ్యుడు కలిగొట్ల గోపాల శర్మ మాట్లాడుతూ మాధవీలత కవితలు సామాజిక సేవకు, దేశభక్తికి అనుగుణంగా ఉన్నాయన్నారు నిర్వాహకుడు రంగసాయి మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ కవితలను రాయడం గొప్ప విశేషమని ఆ కవితలను తెలుగు భాషాభిమానుల సంఘం ద్వారా పుస్తక రూపం చేస్తామని అన్నారు.స్కూల్ హెచ్ఎం సుధారాణి,అరసవల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సుబ్రహ్మణ్యం, తెలుగు భాషాభిమానుల సంఘం సభ్యులు సూర్యనారాయణ, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కేగిరి మాట్లాడారు.మాధవీలత మాట్లాడుతూ 12 ఏళ్లుగా కవితలు రాస్తున్నానని మొదటిగా ఈ రోజు సంఘ సేవకులు రంగసాయి సత్కరించి ప్రోత్సహిస్తు న్నారన్నారు. నరహరి శెట్టి కృష్ణ, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు



గణపవరం- భీమవరం రహదారిపై రాస్తారోకో చేస్తున్న సీపీఎఫ్ ఉద్యోగులు, కార్మికులు

సీపీఎఫ్ ఉద్యోగులు, కార్మికులు రాస్తారోకో

గణపవరం, జూన్ 8: ఉద్యోగ భద్రత కల్పించాలని, నిలుపుదల చేసిన ఫ్యాక్టరీని తెరవాలని, వేతనాలు తక్షణం చెల్లించాలని తదితర డిమాండ్లతో సీపీఎఫ్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు రాస్తారోకో చేశారు. శనివారం గణపవరం మండలం సరిపల్లెలోని ఫ్యాక్టరీ ఎదుట గణపవరం- భీమవరం రహదారిపై రాస్తారోకో చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న సీపీఎఫ్ రొయ్యల, మేతల తయారీ ఫ్యాక్టరీలు లాభాల బాటలో ఉన్నప్పటికి స్థానిక ఫ్యాక్టరీ మాత్రం మూసివేయడం వలన తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఉద్యోగులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికి అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని పరిహారం చెల్లించాలని ఫ్యాక్టరీ యాజమాన్య విధానాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా అధికా రులను కోరుతున్నారు. అనంతరం ఫ్యాక్టరీ ఎదుట నినాదాలు చేశారు.

రేపటి నుంచి నిట్‌లో జోసా కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 8 : ఏపీ నిట్‌లో 8 కోర్సులకు గానూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 480 సీట్లు ఉన్నాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. వీటిలో 50 సీట్లను రాష్ట్ర విద్యార్థులతోను, మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతోనూ జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రారంభం కానుందని, విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని తమకు నచ్చిన కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.

నీట్‌లో ప్రతిభ కనబర్చిన సాయి



మొగల్తూరు,జూన్ 8: ఇటీవల విడుదల అయిన నీట్ ఫలితాల్లో మొగల్తూరు మండల పరిషత్ ఉపాధ్యాయు రాలు నిహారిక కుమారుడు కెటి షణ్ముఖ శ్రీసాయి మంచి ప్రతిభ కనబర్చాడు. ప్రవేశ పరీక్ష నీట్‌లో 720 మార్కులకు గానూ 681 మార్కులు సాధించాడు. జాతీ య స్థాయిలో 8,050 ర్యాంకు, ఓబిసి కేటగిరిలో 3,270 ర్యాంకు సాధించాడు. శ్రీసాయి తండ్రి కోళ్ళ భాస్కరరావు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంపీహెచ్‌వోగా విధు లు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహ రావు, మాజీ సర్పంచ్ మామిడిశెట్టి సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ గుబ్బల నాగరాజు తదితరులు అభినందనలు తెలిపారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



జగన్ వల్లే.. ఓడిపోయాం !



కార్యకర్తలను పట్టించుకోలేదు..

నాయకులకు సముచిత స్థానం ఇవ్వలేదు..

ప్రజా ప్రతినిధులదీ ఇదే దుస్థితి

జిల్లాలో ఓటమి పాలైన అభ్యర్థుల ఆవేదన

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం దారుణ ఓటమిపై ఆ పార్టీ నేతలు పోస్టుమార్టం చేసుకుంటున్నారు. ఘోర పరాజయాన్ని చవిచూడడాన్ని జీర్ణిం చుకోలేకపోతున్నారు. కార్యకర్తల్లో ఒకింత ధైర్యాన్ని నూరిపోసే ప్రయత్నాలు మొదలెట్టారు. ఆ దిశగా అధిష్ఠానం నుంచి సూచనలందాయి. తొలుత తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని కొందరు నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు. అంతర్గతంగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తల నుద్దేశించి మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారి తీశాయి. జగన్‌మోహన్‌రెడ్డి తప్పిదం వల్లే పార్టీ ఓడిపోయిందన్న సంకేతాలు కార్యకర్తలకు పంపారు. పార్టీకి మూలస్తంభాలైన కార్యకర్తలు, కష్టపడి పనిచేసే నాయకులు, ప్రజల నుంచి గెలుపొందిన ప్రజా ప్రతినిధులకు జగన్ మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇవ్వలేదని కొట్టు వ్యాఖ్యానించారు. అందరి లోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉందని కుండబద్దలు కొట్టారు. మరోవైపు జగన్‌మోహన్ రెడ్డి నియమించుకున్న ఐప్యాక్ సంస్థపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. అదొక పనికిమాలిన సంస్థగా అభివర్ణించారు. ఐఐటీలు చేశాం. పెద్ద చదువులు చదివాం అంటూ ఐప్యాక్ సంస్థ ప్రతినిధులు గొప్పలు చెప్పు కున్నారు. అంతే తప్ప స్థానిక రాజకీయ నాయకులకు విలువ లేకుండా పోయింది. నియోజకవర్గంలో అసంతృప్తి నేతలతో సమావేశాలు ఏర్పాటు చేశారంటూ ఐప్యాక్‌పై కొట్టు సత్యనారాయణ విరుచుకుపడ్డారు. వాస్తవానికి జిల్లాలోని అందరి నేతల్లోనూ ఇదే రకమైన అభిప్రాయం ఉంది. ఇప్పుడంతా జగన్‌మోహన్ రెడ్డి వైఖరి వల్లే పార్టీ మట్టికొట్టుకు పోయిందన్న వాదనలు వినిపిస్తున్నారు. అయితే జగన్‌మోహన్ రెడ్డికి మించి జిల్లాలో దందాలు నడిపిన విషయాన్ని విస్మరిస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ భారీ ఓట్లతో తేడాతో వైసీపీ నేతలు ఓటమి చవిచూశారు. అందుకు తిలా పాపం తలాపిడికెడు అన్నట్టు ఓటమిలో రాష్ట్రస్థాయి నేతలనుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల వరకు ఉంది.. జగన్‌మోహన్ రెడ్డిని చూసుకుని జిల్లాలో అధికార పార్టీ నాయకులు తమకు ఇక తిరుగులేదన్న ధోరణిలో ఉండిపోయారు. అధినేతను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు చేశారు. తెలుగుదేశం, జనసేన నాయకులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పోలీస్‌లను తమకు అనుకూలంగా విని యోగించుకున్నారు. జిల్లాలోనూ పోలీస్ పాలన కొనసాగించారు. చంద్రబాబు తాడేపల్లిగూడెంలో పర్యటిస్తే వైసీపీ శ్రేణులను కొట్టు సత్యనారాయణ ఉసిగొల్పారు. సభకు అవరోధం కల్పించేలా నల్లబెలూన్‌లు ప్రదర్శించారు. అలాగే యువగళం పాదయాత్ర సమయంలో గ్రంధి శ్రీనివాస్ తమ పార్టీ అనుచరులతో దాడి చేయించారు. తణుకులో అమరావతి పాదయాత్రకు అడుగడుగునా అడ్డం కులు సృష్టించారు. ఇవన్నీ జనంలో వ్యతిరేకతను పెంపొందింపచేశాయి.

కార్యకర్తలను విస్మరించింది ఎవరు

నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూడా కార్యకర్తలను పెద్దగా పట్టించు కోలేదు. ఆ నెపాన్ని ఇప్పుడు పార్టీపై నెడుతున్నారు. ఆర్థిక ప్రయోజనాలన్నీ నియోజకవర్గ నేతలే పొందారు. కార్యకర్తలను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్లు కూడా తమ బినామీలతో చేయించుకున్నారు. నేతల అవినీతికి అడ్డే లేకుండా పోయింది. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నర్సాపురం, ఆచంట నియోజకవర్గాల్లో అధికార పార్టీ నేతలపై అవినీతి మచ్చ పడింది. మరోవైపు ఆర్థికంగా నేతలు బాగుపడ్డారు. అంతకు మించి వలంటీర్లపై నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కేడర్‌ను విస్మరించారు. ఇవన్నీ ఎన్నికల్లో అధికార పార్టీపై తీవ్ర ప్రభావాన్నే చూపాయి. అంతకు మించి జిల్లాలో అభివృద్ధి జరగలేదు. ప్రాజెక్టులన్నీ పడకేశాయి. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో శంకుస్థాపనలు చేసిన పనులు ఏవీ జరగలేదు. మౌలిక వసతులు లేవు. నిర్మాణ రంగం చావుదెబ్బతింది. రవాణా రంగం కుదైలేంది. వ్యాపా రాలు పతనమయ్యాయి. ఇవన్నీ విస్మరించారు, కేవలం సంక్షేమ పథకాలు అంటూ అధికార పార్టీ నేతలు ఊదరగొట్టారు.అవే తమను గెలిపిస్తాయని ధీమా ప్రదర్శించారు. వలంటీర్లే లేకపోతే ఎన్నికలు లేవన్న దుస్థితికి నేతలు చేరారు. తీరా ఓటమి చెందిన తర్వాత తప్పంతా జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఓటమిపై ఆత్మస్తుతి పరనింద అన్న ధోరణిలో జిల్లాలోని వైసీపీ నేతల వ్యవహారం ఉంది. మొత్తంపైన ఓటమి బాధల నుంచి తప్పుకోవడానికి తమ అధినేతపైనే నిష్టూరాలాడుతున్నారు.

భక్తజన సంద్రం..శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, జూన్ 8: ద్వారకాతిరుమల క్షేత్రం శనివారం గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణతో పులకించింది. శ్రీవారి క్షేత్రం భక్తజన సంద్రమైంది. నెలపొడుపు కావడంతో భక్తులు పోటెత్తారు. ఆలయం లోని అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. గంటల తరబడి దాదాపు 3 గంటల సమయం శ్రీవారి ఉచిత దర్శనానికి పట్టింది. వాహనాలు అధికంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

రికార్డుస్థాయిలో నిత్యార్జిత కల్యాణాలు

శ్రీవారి నిత్యకల్యాణమండప ఆవరణలో శనివారం రికార్డు స్థాయిలో నిత్యార్జిత కల్యాణాలు జరిగాయి. వేసవిసెలవులు పూర్తి కావస్తుండటంతో అదిక సంఖ్యలో 208 జంటలు పూజల్లో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక అలంకారాలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఘనంగా కల్యాణం నిర్వహించారు.


శ్రీవారి క్షేత్రంలో అనివేటి మండప ప్రాంతంలో భక్తుల రద్దీ


నిత్యార్జిత కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు..పాల్గొన్న భక్తులు


గ్రామోత్సవానికి బయలు దేరుతున్న అమ్మవారు

వైభవంగా ప్రారంభమైన మావుళ్ళమ్మ జ్యేష్టమాస జాతర

భీమవరం టౌన్, జూన్ 8 : పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ జ్యేష్టమాస జాతర మహోత్సవాలు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి గరగ లను ఉంచి ఆలయ ప్రధానర్చాకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ పూజలు చేశారు. పుట్టింటి వారి తరపున అల్లూరి వారి కుటుంబ సభ్యులు, అత్తింటి వారి తరుపున మెంటే వారి కుటుంబసభ్యులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, వేద మంత్రాలతో అమ్మవారి గరగలను మోటపల్లివారివీధిలో ఉన్న గరగల గుడికి తీసుకువెళ్ళారు. పొట్టి శ్రీరాములు విగ్రహం, నరసాపురం-భీమవరం రోడ్డు, భీమేశ్వరస్వామి ఆలయం వీధి మీదుగా గరగల గుడి వద్దకు తీసుకువచ్చి అందులో ఉంచారు. ఇక నుంచి ప్రతీరోజు ఇక్కడ కూడా పూజలు నిర్వహిస్తారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.38.36 లక్షలు


వాడపల్లి వెంకన్నను దర్శించుకున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

ఆత్రేయపురం, జూన్ 8: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్త జనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్య లక్ష్మీహోమం,బాలభోగం తదితర కార్య క్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పా లతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శిం చుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలంరిం చాయి. మండపేట ఎమ్మెల్యేవిజేత వేగుళ్ళ జోగేశ్వరరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.38.36 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్, ఈవో భూపతిరాజు కి షోర్‌కుమార్ తెలిపారు.

ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కోమట్లపల్లి సుబ్బారావు



ఉండ్రాజవరం, జూన్ 8: ఉండ్రాజవరం మం డలం కాల్దరి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు, పౌల్ట్రీ వ్యాపారి కోమట్లపల్లి వెంకట సుబ్బా రావు శనివారం విజయవాడలో జరిగిన కార్యక్ర మంలో ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన ఇంతవరకు ఫెడరేషన్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. సుబ్బారావు మాట్లాడుతూ కోళ్ల పరిశ్రమ ప్రస్తుతం ఒడిదుడుకులతో నడు స్తోందని, రైతులు సమస్యలు, నష్టాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామ కృష్ణ, కోళ్ల పరిశ్రమ యజమానులు గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, మల్లిన శ్రీనివాసరావు, బూరుగుపల్లి రాంబాబు, బూరుగుపల్లి వెంగళరావు, బూరుగుపల్లి శ్రీనివాసరావు, అభినందనలు తెలిపారు.


సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని ఆటలు ఆడుతున్న విద్యార్థులు

వేసవి శిబిరంలో చిన్నారులకు పోటీలు

పాలకొల్లు, జూన్ 8 : పాలకొల్లు బోళ్ళవారి తోట ప్రాంతంలో గల ఒహెల్ హ-సింహ సంస్థ ఆధ్వర్యంలో చిల్డ్రన్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి నీతి శాస్త్రం, ప్రాచీన సంప్రదాయాలు, శానిటేషన్ వంటి వాటితో పాటు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. శనివారం నిర్వహించిన వివిధ పోటీలలో, విజేతలకు బహుమతులను సంస్థ సీనియర్ వలంటీర్ ఆకుల కృపాదేవి అందించారు. సైన్స్ మూవీ ప్రదర్శన, నాగరికతపైన, విజ్ఞాన దాయకమైన పలు అంశాలను ఈ శిబిరంలో బోధించారు. సంస్థ ప్రతినిధులు నిత్యజీవ్ మాట్లాడుతూ ఈ శిబిరం ఈనెల 10వ తేదీతో పూర్తి అవుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముదినేపల్లి రూరల్, జూన్ 8: రొయ్యల చెరువులో పట్టుబడుకి వెళ్ళిన కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామానికి చెందిన లాలా దుర్గాప్రసాద్ (32) శనివారం అదే గ్రామానికి చెందిన రైతు చెరువులో రొయ్యలు పట్టుబడికి వెళ్ళాడు. చెరువు అడుగున ఉన్న బురద నీటిని మోటారుతో తోడుతూ మోటారు జరిపే యత్నంలో దుర్గాప్రసాద్ విద్యుదాఘాతానికి గురయ్యాడు.సహచర కూలీలు గమనించి దుర్గాప్రసాద్‌ను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకట్ కుమార్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజీనామా చేస్తారా ?

ఉత్తర్వులు వచ్చేవరకు వేచి చూస్తారా ?

చర్చనీయాంశంగా అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు



అన్నవరం, జూన్ 8: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో పాలకమండలి సభ్యులు కొనసాగింపు రత్నగిరిపై చర్చనీయాం శంగా మారింది. ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు తమ నాయకుల సిఫారసుతో వారి అనుచరులకు పాలకమండలి సభ్యులుగా నియమింపబ డతారు. గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలు పాలకమండలి నియమిం పబడగా ప్రస్తుతం ఉన్న పాలకమండలి 2023 ఫిబ్రవరి 9న ప్రమాణస్వీ కారం చేయగా వారికి 2025 ఫిబ్రవరి 8తో గడువు ముగుయనుంది. అయితే ప్రభుత్వం మారడంతో పలుచోట్ల నామినేటెడ్ పదవులకు కొందరు స్వచ్ఛంధంగా రాజీనామాలు చేస్తుండగా అన్నవరం దేవస్థానంలో సభ్యులు మాత్రం స్వచ్ఛందంగా తప్పుకుంటారా లేక ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చేవ రకు వేచిచూస్తారా అనేది తేలాల్సిఉంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరక ముందే సీఎంవో కార్యాలయం నామినేటెడ్ పోస్టులను రద్దు చేస్తున్నట్లు ఇప్పటికే ఉత్తర్వులు వెలువరించగా ఆదేశాలు సంబంధింత కార్యాలయా లకు చేరలేదు. ప్రస్తుతం ఉన్న పాలకమండలిలో చైర్మన్, ఐ.వి రోహిత్ వంశపారంపర్య ర్మకర్తగా, ప్రధానార్చకులు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కొనసాగుతున్నారు. వీరిద్దరు మినహా ఉత్తర్వులు వెలువడితే 14 మంది సభ్యులు రాజీనామాలు చేయాల్సిందే. దేవస్థానంలో పాలకమండలి సభ్యు లు ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా కేవలం తమ తమ అనుచరగణంకి దర్శనాలు, సత్రం గదుల కేటాయించలేదంటూ సమావేశపు హాలులో చర్చించడంతో అప్పట్లో పలు విమర్శలు వచ్చాయి. నూతన ప్రభుత్వంలో కొత్త పాలకమం డలిలో చోటు దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు ద్వితీయ శ్రేణి నాయ కులు ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ హయాంలో పాలకమండలి సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ జారీచేసి దరఖాస్తులు ఆహ్వానించే వారు. పోలీస్‌స్టేషన్‌లలో ఆయా ఆశావాహులపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉన్నా వారి పేర్లను నిర్మొహమాటంగా తొలగించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి నోటిఫికేషన్స్, విచారణలు లేకుండానే నేరుగా సభ్యులను నియమిస్తూ జీవోను జారీచేశారు. పాలకమండలి నియామకంలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల నుంచి ఇద్దరు, జగ్గం పేట, కాకినాడ, రాజమహేంద్రవరం, పిఠాపురం నియోజకవర్గాల నుంచి ఒకొక్కరూ ఇతర ప్రాంతాల్లో పట్టున్న ఎమ్మెల్యేలు తమ అనుచరులకు పాలకమండలిలో సభ్యత్వం ఇప్పించేవారు. త్వరలో కొలువుదీరే పాలక మండలిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ప్రాధాన్యం కల్పించాల్సి ఉండడంతో కూర్పు ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

కాలినడకన ద్వారకా తిరుమలకు...

చాట్రాయి, జూన్ 8: నూజివీడు ఎమ్మెల్యేగా పార్థసారథి, ఏలూరు ఎంపీగా మహేష్ యాదవ్, సీఎంగా చంద్రబాబు గెలుపొంది రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన ద్వారకా తిరుమల శ్రీవారి దర్శ నానికి వస్తామని మండలంలోని కొత్తగూడెం గ్రామ టీడీపీ కార్యకర్తలు మొక్కుకున్నారు. శనివారం సుమారు 100 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గోవింద నామస్మరణ చేసుకుంటూ కాలినడకన ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్ళారు.

మామిడికి భలే గిరాకీ

టన్ను రూ.40 వేలు



తుని రూరల్, జూన్ 8: మెట్టలో అధికంగా ఉద్యానవన పంటగా సాగు అవుతున్న మామిడికి ఈ ఏడాది మంచి గిరాకీ ఏర్పడింది. మెట్టలో ప్రదాన మార్కెట్‌లో నాణ్య తను బట్టి టన్ను రూ.35 వేలు నుంచి రూ. 40 వేల వరకు భంగినపల్లి మామిడి అమ్మకడు అవుతోంది. ఆశించిన మేర మార్కెట్‌లోకి కాయలు రాకపోవడంతో రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పోటీ పడికొనుగోలు చేస్తున్నారు. నాలుగు రోజులు క్రితం మార్కెట్ దిగువ రేట్లకు ఉన్నప్పటికీ శుక్ర, శనివారం తుని మార్కెట్లో మామిడికి ఒక్కసారిగా రేటు పెరిగింది.ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 10 శాతం పంట దిగుబడి రాలేదు. దీంతో ఉన్న పంటకు మంచిగిరాకీ ఏర్పడినట్లు మెట్ట రైతులు తెలుపుతున్నారు.గత ఏడాది భంగినపల్లి కాయకులు టన్నుకు గరిష్టంగా రూ. 10 వేలు నుంచి రూ.15 వేలు ధర మాత్రమే వచ్చింది. ఈ ఏడాది రేట్లు 3 రెట్లు ధర పెరి గినా దిగుబడి లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గేమ్ చేంజర్ షూటింగ్ సందడి



ఆత్రేయపురం, జూన్ 8: హీరో రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శ కుడు శంకర్ నిర్మిస్తున్న గేమ్ చేంజర్ సినిమా సన్నివేశాలను కోన సీమలో పేరవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం చిత్రీకరించారు. రోడ్డు పక్కనే కొబ్బరిబొండాలు, తాటి ముంజుల దుకాణాలు , హైటెక్ బస్సు అరటి లోడ్‌తో వెళుతున్న సైకి ల్‌ను ఢీకొట్టడం, యువకులు సైకి ళ్ళపై వెళ్తున్న దృశ్యాలను చిత్రీకరిం చారు. రామ్‌చరణ్ అభిమానులతో ఆ ప్రాంతం రద్దీ అయింది.

క్రైం కార్నర్

బలుసుమూడిలో చోరీ

భీమవరం క్రైం, జూన్ 8 : భీమవరం రెండో పట్టణంలోని ఓ అపార్ట్‌మెం ట్‌లో దొంగలు బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నా రని టూటౌన్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. బలుసుమూడిలోని సున్నం ఆంజనేయులు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న పాపరపల్లి మాలతి ఈనెల 1వ తేదీన తన కుమారుడిని ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించడానికి ఇంటికి తాళం వేసి హైద్రాబాద్ వెళ్లారు. ఆమె ఈనెల 6వ తేదీన తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలుగొట్టి ఇంటి బీరువాలోని 144 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు దోచుకున్నారు. బాధితురాలు మాలతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాల్వలో పడి కూలీ మృతి

మొగల్తూరు, జూన్ 8: కూలిపనికి వెళ్ళిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ కె.వెంకట రమణ తెలిపారు. మొగల్తూరు వెలి దివారివీధికి చెందిన వెలిది పాపయ్య (47) ఈనెల 6వ తేదిన కూలి పని నిమిత్తం స్టేషన్ పరిధి సీతారామపురం గ్రామం వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. శనివారం ఉదయం సీతారామపురంలోని మురుగు కాలువలో శవమై కని పించడంతో కుటుంబ సభ్యులు పాపయ్యగా గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు. మృతుని భార్య ముత్యావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.